కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు

సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మహావీర్ వీషు మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో సత్తాచాటారు. ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ లెవెల్ ఉషు చాంపియన్‌షిప్–2024 పోటీలు మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగాయి. మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో జయవర్ధన్ 56 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. సంగమేష్ 48 కిలోల విభాగంలో, శ్రీకాంత్ 52 కిలోల విభాగంలో, సాయిచరణ్ 60 కిలోల విభాగంలో, అనన్య 56 కిలోల విభాగంలో రజత పతకం సాధించారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తన నివాసంలో సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కోచ్ సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ



శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ శివారులోని శ్రీరామనగరంలో చినజీయర్ స్వామి తిరునక్షత్ర మహోత్సవాలు నాలుగో రోజు వైభవంగా జరిగాయి. సోమవారం 31వ సహస్ర కలశాభిషేక మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో పలు రంగాల్లో సేవలు అందిస్తున్న కార్యకర్తలకు చినజీయర్ స్వామి ఆశీస్సులు అందజేశారు. మంగళవారం శ్రీరామచంద్రుని సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: సంత్‌శ్రీ ఆశారామ్‌జీ ఆశ్రమం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. దీపావళి సందర్భంగా కార్మికులకు వీటిని అందజేసినట్లు శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులను సన్మానించారు.

జనాభాకు అనుగుణంగా అభివృద్ధి

మణికొండ కౌన్సిలర్ లావణ్యనరేష్



డ్రైనేజీ పనులను పరిశీలించిన కౌన్సిలర్ లావణ్యనరేశ్

మణికొండ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి పైపుల సామర్థ్యాలను అభివృద్ధి చేస్తున్నామని మణికొండ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ యాలాల లావణ్యనరేష్ అన్నారు. సోమవారం తన వార్డు పరిధిలోని శివపురి కాలనీలో కొనసాగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపార్ట్‌మెంట్‌లు, అధిక పోర్షన్‌ల గృహాలు అధికమయ్యాయని, వాటికి అనుగుణంగా డ్రైనేజీ సామర్థ్యాలను పెంచాల్సిన అవసరాన్ని గుర్తించి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు కౌన్సెలింగ్



చిరు వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

రాజేంద్రనగర్: చిరు వ్యాపారులు రోడ్లపై వచ్చి వ్యాపారం చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సూచించారు. స్టేషన్ పరిధిలోని చిరు (టేలా బండి) వ్యాపారులకు సోమవారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రోడ్లపై చిరు వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించకూడదన్నారు. రోడ్లపై వ్యాపారాలు చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో టేలా బండి వ్యాపారులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో యూట్యూబర్ హర్షసాయి ప్రత్యక్షం

శంషాబాద్ రూరల్: కొంతకాలంగా విదేశాల్లో ఉన్న యూట్యూబర్ హర్షసాయి సోమవారం శంషాబాద్ విమానాశ్రయంలో ప్రత్యక్షమయ్యాడు. ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు. ఒక చిన్న పని ఉండటంతో విదేశానికి వెళ్లి పని పూర్తి చేసుకుని తిరిగి వచ్చినట్లు తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలు నిజం కావని కోర్టు నమ్మి బెయిల్ ఇచ్చిందన్నారు. తాను రాసి తీసిన సినిమాకు వాళ్లే కాపీరైట్స్ అడిగారని పేర్కొన్నారు. తాను ఎక్కడ ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయలేదన్నారు. ప్రజల్లో తనను చులకన చేయడానికి కొందరు అసత్య ప్రచారాలు చేసినట్లు తెలిపారు. పోలీసుల విచారణలో నిజానిజాలు బయటకు రావడంతో కోర్టు బెయిల్ ఇచ్చిందన్నారు. త్వరలో సినిమాను రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు.

అస్తవ్యస్తంగా మ్యాన్‌హోళ్లు

రహదారి ఉపరితలం కంటే కిందికి నిర్మాణం



రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్



రహదారి ఉపరితలం కంటే కిందికి నిర్మించిన మ్యాన్‌హోల్



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. కిస్మత్‌పూర్ నుండి ఎక్సైజ్ అకాడమీ వరకు గత సంవత్సరం రూ.2 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసినప్పటికీ భూగర్భ మురుగునీటి వ్యవస్థపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్ చాలాచోట్ల ప్రమాదకరంగా ఉన్నాయి. అడ్డదిడ్డంగా ఉన్న మ్యాన్‌హోల్స్‌తో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై నిర్మించిన మ్యాన్‌హోల్స్ కుంగిపోయాయి. రహదారి ఉపరితలం కంటే కిందికి మ్యాన్‌హోళ్ల నిర్మాణం చేపట్టడం వల్లే నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇంతజరుగుతున్నా మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. సక్రమంగాలేని మ్యాన్‌హోల్స్‌ను సరిదిద్దాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు రాహుల్‌కు ఘనస్వాగతం పలకాలి

రాజేంద్రనగర్: నేడు నగరానికి రానున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఘనంగా స్వాగతం పలకాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ నెల 6వ తేదీన రాష్ట్రంలో నిర్వహించనున్న సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభించడానికి రాహుల్ వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పెద్ద ఎత్తున బేగంపేట్ విమానాశ్రయానికి తరలివెళ్లి ఘనంగా స్వాగతం పలకాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సుబ్రహ్మణ్యం కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్

బండ్లగూడ: ప్రజా అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోని సుబ్రహ్మణ్యం కాలనీలో 18.50 లక్షలతో సీసీ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ విడతలవారీగా నెరవేరుస్తున్నామన్నారు. ఈ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీరు, సీసీ రోడ్డు వేయడం పట్ల కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బత్తుల నరేందర్, కాలనీ అధ్యక్షులు రమేష్‌మంద, ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్, ఉపాధ్యక్షులు కొండల్‌రావు, సంయుక్త కార్యదర్శి పద్మారెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ బిల్లపాటి, ఫణికుమార్, బి.కిషోర్, ఏ.మురళీ, రాజేష్‌ఖన్నా, వై.సురేందర్, ఏ.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వాటా దక్కాలంటే పోరు తప్పదు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మనోజ్ పండ్ల



బండ్లగూడ: సమగ్ర కులగణన అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మనోజ్ పండ్ల అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షా కోట్‌లోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక విద్యా, ఉద్యోగాలతోపాటు ఆర్థిక, రాజకీయ రంగాల్లో మన వాటా మనకు దక్కాలంటే సమష్టిగా పోరాడి మన హక్కులను, మన వాటాలను దక్కించుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి కులగణన సర్వే మొదలు కాబోతుందని, 136 బీసీ కులాల బిడ్డలు, వారి పేరు చివర వారి కులాన్ని పొందుపరచి మన ఇంటి వద్దకు వచ్చిన ఎన్యూమరేటర్‌కు తెలియజేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు నవంబర్ 6 నుంచి 20వ తేదీ వరకు 15 రోజులపాటు 33 జిల్లాల్లో కులగణన చైతన్య సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు.

సీబీఐటీలో అధ్యాపకుల శిక్షణ ప్రారంభం



ముఖ్యఅతిథిని సత్కరించిన సీబీఐటీ ప్రిన్సిపాల్

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో పరిశ్రమ 5.0 కొరకు ఐఓటీ ఎనేబుల్డ్ సర్వర్ టెక్నాలజీ అనే అంశంపై అటల్ అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టెట్రా ప్రొఫెసర్ పి.శ్రీహరిరావు హాజరుకాగా కార్యక్రమానికి సమన్వయ కర్తగా డాక్టర్ ఎ.సుప్రజారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ 5.0ని నిర్మించేందుకు లాట్, సెన్సార్ టెక్నాలజీ ప్రాముఖ్యతలను వివరించారు. ఐఓటీ సెన్సార్ అప్లికేషన్‌ల కొరకు సీఎంఓఎస్ఏఎఫ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూలర్ రూపకల్పన అనే అంశం గురించి వివరించారు. ఈ నెల 9వ తేదీ వరకు జరిగే శిక్షణలో ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ, ఎన్ఐటీ వరంగల్, బిట్స్ హైదరాబాద్ యూనివర్సిటీలతోపాటు సిలికాన్ లాట్స్, ఎఐఐ, ఎఎండీ, ఆర్‌సీఐల నుంచి విశిష్ట వక్తలు హాజరుకానున్నట్టు సమన్వయ కర్త తెలిపారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, ఆర్ అండ్ డీ డైరెక్టర్ డి. కృష్ణారెడ్డి, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ నరహరి శాస్త్రిలతో పాటు పలు కళాశాలల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అత్యవసర సేవలపై అవగాహన

యాకుత్‌పురా: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలు, అత్యవసర సేవలపై అవగాహన ఏర్పర్చుకోవాలని 108 అంబులెన్స్ సేవ సర్వీసుల ప్రధాన కార్యాలయ కో ఆర్డినేటర్ దేవేందర్ సూచించారు. అత్యవసర అంబులెన్స్ సేవలపై సుల్తాన్‌షాహీలోని ప్రభుత్వ శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఆయన సభ్యులతో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన దేశంలోని 17 రాష్ట్రాల్లో 2005 నుంచి 108 అత్యవసర సేవలను ప్రారంభించి ఉచితంగా ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. అత్యవసర సేవలపై అవగాహన లేకపోవడంతో చాలా మంది ప్రాణలు కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరి నారాయణ, అత్యవసర సేవ సర్వీసుల సభ్యులు ప్రదీప్, పార్వతీ, ఉపాధ్యాయులు అనురుధ్‌రావు, మధుసూదన్‌రావు, డాక్టర్ విజయ్‌భాస్కర్, శ్రీదేవి, అంజలి, ప్రమీల నవనీత, శివప్రసాద్, రజిత, సత్యనారాయణ పాల్గొన్నారు.

సేవ చేసేవారికి గుర్తింపు

గోల్కొండ: సమాజ సేవ చేసే వారికి ప్రజలు గుర్తించడమే కాకుండా గౌరవం కూడా ఇస్తారని ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ జాతీయ చైర్మన్ నేమ్‌సింగ్ అన్నారు. 18 ఏళ్లుగా నిరుపేదలకు వివిధ రకాల సేవలు అందిస్తున్న మహ్మద్ ఇస్మాయిల్‌కు సోమవారం ఆయన టోలిచౌకీలోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ హక్కుల పరిరక్షణ కోసం తమ సంస్థ మూడు దశాబ్దాలుగా క్రియాశీలకంగా పని చేస్తుందన్నారు. తెలంగాణలో తమ సంస్థ తరఫున మహ్మద్ నజీబ్ ప్రోత్సాహంతో మహ్మద్ ఇస్మాయిల్ సమాజ సేవలో చురుకుగా వ్యవహరిస్తున్నారన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: గ్రీన్‌విచ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని క్రిస్టల్ టౌన్, మొగల్ కాలేజ్ , రహమత్ కాలనీ, సుబాన్ హిల్స్, రాయల్ సీ హోటల్, వాదేయిపర్వాన్, అబ్దుల్లాకాలనీ, పటేల్ నగర్, న్యూరినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమగ్ర కుటుంబ సర్వేపై అవగాహన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించాల్సిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేకరించాల్సిన వివరాలు, ఇతర వాటి గురించి రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ వివరించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్, ఏఈఓ శంకర్, సీఓ విజయ, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పరామర్శ



కోరని బాలరాజును పరామర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజేంద్రనగర్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బుద్వేల్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోరని బాలరాజును సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలో కోల్కొని ప్రజలకు సేవ చేయాలన్నారు. పరామర్శించిన వారిలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మద్దిలేటి మాదిగ, కె.శంకర్ రావు మాదిగ, మంగళారం రత్నం మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు పోతురాజు యాదయ్య మాదిగ, మద్దూరి రాజు, జిల్లా నాయకులు ఆర్.ఎస్.చిట్టిబాబు మాదిగ, నాన్నగారి రామచందర్ మాదిగ, కె.నారాయణ, విఘ్నేష్ తదితరులు ఉన్నారు.

పోల్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టిన కారు



రాజేంద్రనగర్: వేగంగా దూసుకొచ్చిన ఓ కారు పీవీ నర్సింహారావు ఫ్లైఓవర్ ఉప్పర్‌పల్లి సమీపంలో ఉన్న ఎలక్ట్రిక్ పోల్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ సంఘటన సోమవారం పీవీ నర్సింహారావు ఫ్లైఓవర్‌పై చోటుచేసుకుంది. దీంతో ఈ సంఘటనతో ఫ్లైఓవర్ రెండు వైపుల పెద్ద ఎత్తున ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ సంఘటనలో హైదరాబాద్ నుంచి ఆరాంఘర్ వైపు వస్తుండగా వాహనాన్ని కంట్రోల్ చేసుకోలేక ఎలక్ట్రికల్ పోల్‌ను ఢీకొట్టడంతో డ్రైవర్ స్వల్ప గాయాలకు గురయ్యాడు. దీంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి

మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు సమస్యలు వివరించిన కాలనీలవాసులు

మణికొండ: నెక్నాంపూర్‌గ్రామం పరిధిలోని కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఈవీవీ కాలనీ, ఫెయిర్ ఫీల్డ్ కాలనీ, స్పెక్ట్రమ్ విల్లాస్, పయనీర్ ఎస్టేట్ కాలనీల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను కాలనీలవాసులు ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకుల ఆధ్వర్యంలో చైర్మన్‌తో పాటు కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్‌కు వివరించారు. డ్రైనేజీ, పార్కు అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు మరమ్మతులు, తాగునీరు, క్రీడా ప్రాంగణం ఏర్పాటు వంటి వాటిని వారి దృష్టికి తీసుకొచ్చారు. అన్ని కాలనీల సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నామని, త్వరలోనే ఇంజనీరింగ్ అధికారులను పంపి వాటికి అంచనాలను సిద్ధం చేస్తామని చైర్మన్, కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు, ఆయా కాలనీలవాసులు పాల్గొన్నారు.

కులగణన ఎన్యూమరేటర్లకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కులగణనను సమర్థవంతంగా చేపట్టాలని కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి, సమగ్ర కులగణన చేపట్టే తీరుపై సోమవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని షాదాన్ కాలేజ్‌లో అధికారులు ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ దరఖాస్తులో ఇచ్చిన అంశాలకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిగా వాటిని సేకరించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి నివేదించాలన్నారు.

కార్యక్రమంలో మేనేజర్ మంజుల, డీఈ యాదయ్య, ఏఈ రాజ్‌కుమార్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైస్ చాన్స్‌లర్‌కు సన్మానం



వైస్ చాన్స్‌లర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: సీనియర్ సిటీజన్ల (విశ్రాంత) అసోసియేషన్ కమిటీ సభ్యులు వ్యవసాయ యూనివర్సిటీ నూతన ఉప కులపతి డాక్టర్ ఎ.జానయ్యను సన్మానించారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ పథకాలైన కార్పస్ ఫండ్ ఏర్పాటు, కుటుంబసభ్యులకు కూడా హెల్త్ సెంటర్ ద్వారా వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చినందుకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. భవానీకాలనీకి, విశ్వవిద్యాలయానికి నడుమ ఉన్న వికెట్ గేట్‌ను తొలగించాలని వినతిపత్రం అందజేశారు. వీసీని కలిసిన వారిలో భవానీ కాలనీ సీనియర్ సిటిజన్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేము వందనం, కమిటీ సభ్యులు ఎ.సత్యనారాయణ, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్, సలహాదారులు అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎస్.ఎం.భాష, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుందర రావు, ఎగ్జిక్యూటీవ్ సభ్యులు జయరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి




షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా టోలిచౌకీ, ఎండిలైన్స్, టూంబ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..పనులు సకాలంలో పూర్తి కాకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ఎండిలైన్స్ నుంచి మోతీ దర్వాజ వర కు జరుగుతున్న పనులు నత్తనడకన సాగుతున్నాయ ని అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే పనులు సకాలంలో పూర్తి కావడం లేదని ఆయన అన్నారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ..

హకీంపేట్ ఎస్ఎస్ గార్డెన్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రెండు పథకాలతో నిరుపేదలకు తమ ఆడపిల్లల పెళ్లిళ్ల సందర్భంగా ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులు బాగా తగ్గాయన్నారు. ఇంకా ఎన్నో దరఖాస్తులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సరైన ధ్రువపత్రాలు జత చేయకపోవడం వల్లే అవి ఆగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆలీముద్దీన్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



గోల్కొండ: శాంతిభద్రత పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. గోల్కొండ డివిజన్ పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు సోమవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నగరంలో జరుగుతున్న వివిధ వర్గాల పండుగలు శాంతియుతంగా పూర్తయిన సందర్భంగా వారు సీపీని కలిసి సన్మానించారు. సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఎటువంటి ఆటంకాలు లేకుండా వివిధ వర్గాల వారికి ర్యాలీలు, ఉత్సవాలు నిర్వహించుకోవడానికి శరతులతో కూడిన అనుమతులు ఇచ్చామన్నారు. ర్యాలీలు, వేడుకల నిర్వాహకులు తమ సూచనలను పాటించారన్నారు. స్థానికంగా జరిగే పండుగల సందర్భంగా పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు పోలీసులకు అండగా ఉంటూ ప్రతి ఉత్సవం శాంతియుతంగా జరిగేలా చూశారన్నారు. ఆయనను కలిసిన వారిలో ఆబిద్, ఆజామ్‌ఖాన్, తహసీన్‌పాషా, నర్సింగ్ తదితరులున్నారు.